సాక్షి ఒడిశా

ఆదివారం । 19 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం

నగదు: రూ.4,32,912

బంగారం: 150 మిల్లీగ్రాములు

వెండి: 45 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



164 ఏళ్ల కట్టడం నేలమట్టం

పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో పాత పార్శిల్ గోడౌన్ కూల్చివేత. దీనిని 1860లో బ్రిటీషర్లు నిర్మించారు.

- 8లో



రైల్వే పురస్కారాలు ప్రదానం

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం 68వ రైలు సేవా పురస్కారాలను పలువురికి ప్రదానం చేశారు.

- 8లో

రెండో దశకు సిద్ధం



వివరాలు వెల్లడిస్తున్న సీఈవో నికుంజ బిహారీ ధొలా

- రేపే 2వ విడత పోలింగ్: సీఈఓ
- 102 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు
- 60 శాతం బూత్‌లలో ఓటింగ్ వీడియో చిత్రీకరణ
- 20 శాతం సమస్యాత్మక కేంద్రాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో దశ పోలింగ్ కోసం సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నికుంజ బిహారీ ధొలా తెలిపారు. ఐదు లోక్‌ సభ, 35 శాసనసభ స్థానాలకు ఈ నెల 20న రెండో దశ పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. భువనేశ్వర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఓటింగ్ ప్రత్యక్ష ప్రసారం..

ఈ విడత 14 అదనపు బూత్‌లతో సహా 9,162 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు. ఒక్కో బూత్‌కు సగటు ఓటర్లు 870 మందిగా విశ్లేషించారు. 60 శాతం బూత్‌లలో ఓటింగ్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత (ఎల్‌డబ్ల్యూఈ) జిల్లాల్లో 20 శాతం సమస్యాత్మక/క్లిష్టమైన పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.

భారీ స్థాయిలో నగదు జప్తు

ఎన్నికల ప్రచారంలో ఇప్పటివరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రూ.254 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీఈవో తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 17.18 కోట్ల నగదు, 31 లక్షల లీటర్ల మద్యం, రూ.73 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.14 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నట్లు వివరించారు. బర్‌గఢ్ జిల్లాలో అత్యధికంగా రూ.1.26 కోట్ల నగదు, అత్యధికంగా 8 లక్షల లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కంధమల్, అసికా పార్లమెంట్ నియోజకవర్గాల్లో క్రమంగా రూ.36 లక్షలు, రూ.13 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు..

మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో 1,041 పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో 25 బూత్‌లను నిర్వహించనున్నామని సీఈఓ చెప్పారు. 1,541 ఆదర్శ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

- జిల్లాల్లో 102 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) మోహరించనున్నట్లు తెలిపారు. కంధమల్ జిల్లాలో అత్యధికంగా 22 కంపెనీలను మోహరిస్తామని, గంజాంలో 20 కంపెనీలు, సుందర్‌గఢ్‌లో 16 కంపెనీలు, బొలంగీర్, బర్‌గఢ్‌లో 14 కంపెనీలు చొప్పున, ఝార్సుగుడలో 5 కంపెనీలు, సోన్‌పూర్‌లో 4, నయాగఢ్‌లో 2 సీఏపీఎఫ్ కంపెనీలను నియమించనున్నట్లు వివరించారు.
- ఐదు పార్లమెంట్, 35 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికల్లో 79,69,887 మంది ఓటర్లు తమ ఓటు హక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 39,45,000 మంది మహిళా ఓటర్లు, 40,33,992 మంది పురుషులు, 851 మంది తృతీయ లింగ ఓటర్లు ఉన్నట్లు వివరించారు.
- 18 నుంచి 19 సంవత్సరాల మధ్య 2.67 శాతం, 20 నుంచి 29 సంవత్సరాల మధ్య 21.31 శాతం, 30 ఏళ్ల లోపు ఓటర్లు 24 శాతం మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.
- 35 అసెంబ్లీ నియోజక వర్గాలకు 40 మంది మహిళలతో సహా 265 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని సీఈఓ చెప్పారు. ఐదు లోక్‌ సభ స్థానాలైన బర్‌గఢ్, సుందర్‌గఢ్, కంధమల్, అసికా, బొలంగీర్ నుంచి 40 మంది బరిలో ఉన్నట్లు తెలిపారు.

పునరుత్పాదక ఇంధనంపై ప్రత్యేక దృష్టి



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐటీ, నెక్స్‌హెచ్‌ఎస్ సంస్థ ప్రతినిధులు

- పరిశోధనలో ముందడుగు వేసిన భువనేశ్వర్ ఐఐటీ
- చెన్నై సంస్థతో అవగాహన ఒప్పందం

భువనేశ్వర్: స్థిరమైన ఇంధన పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించి వివిధ అనుబంధ ప్రాజెక్టులు, కార్యక్రమాలు, పరిశోధన పట్ల స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) దృష్టి సారించింది. ఈ ప్రయత్నాలపై పరస్పర సహకార లక్ష్యంతో చెన్నై నెక్స్‌హెచ్‌ఎస్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎస్‌ఐఎఫ్‌టీ) అభివృద్ధి నిధి పథకం కింద స్థానిక ఐఐటీ స్కూల్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీరప్రాంత, నది తీరం కోత పరిశోధనలకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తోంది. తీరప్రాంత భూభాగాల నిర్మాణ అంశాలు, నది ఒడ్డు సుస్థిరత, వివిధ ఆఫ్‌షోర్ నిర్మాణాలకు సంబంధించిన పలు సమస్యల నివారణ దిశలో పరిశోధనల్ని ప్రోత్సహిస్తుంది. ఒప్పందం ప్రకారం, ఈ కేంద్రానికి అవసరమైన పరికరాల సేకరణకు నెక్స్‌హెచ్‌ఎస్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పాక్షిక నిధులను సమకూర్చుతుంది. పరిశోధన దిశలో పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతాలను గుర్తించి ఉమ్మడి పరిశోధన బృందాలను వెన్నుతట్టి వైజ్ఞానిక, వనరుల మార్పిడిని సులభతరం చేసేందుకు ఉభయ సంస్థలు ఉమ్మడిగా కృషి చేస్తాయి. ఈ సందర్భంగా ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ భాగస్వామ్యం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సహకారం పచ్చదనం పరిరక్షణ మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం పునరుత్పాదక ఇంధన సాంకేతికత శక్తిని ఉపయోగించుకునే దిశలో ముందడుగుగా పేర్కొన్నారు. ఈ క్లిష్టమైన రంగంలో ప్రభావవంతమైన పరిశోధన, ఆవిష్కరణ ప్రాధాన్యత సంతరించుకుంటుందని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కూల్ హెడ్ ప్రొఫెసర్ సుమంత హల్దార్ తెలిపారు. డాక్టర్ అరిందమ్ సర్కార్, డాక్టర్ టి.జ్యోతి శరవణన్ మాట్లాడుతూ ప్రస్తుతం తీరప్రాంతం కోత, నదుల కోసం కేంద్రంలో అత్యాధునిక పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. పునరుత్పాదక ఇంధన సాంకేతిక పరిజ్ఞానాల పురోగతికి గణనీయమైన సహకారాన్ని అందించడానికి ఐఐటీ భువనేశ్వర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు నెక్స్‌హెచ్‌ఎస్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సుధాంశు భూషణ్ వృష్టి తెలిపారు.

న్యూస్‌రీల్

వడగాలుల హెచ్చరిక

భువనేశ్వర్: రాష్ట్రంలో వాతావరణం వేడెక్కనుంది. వడగాడ్పుల తీవ్రతతో వేడిమి వాతావరణం నెలకొంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం ముందస్తు సూచన జారీ చేసింది. ఈ నెల 21 వరకు పగటి పూట ఉష్ణోగ్రత 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 20న బరగఢ్, నువాపడా, బొలంగీర్, సోన్‌పూర్, బౌధ్, కంధమల్ వంటి ఆరు జిల్లాలకు ఐఎండీ ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. 21న మయూర్‌భంజ్, కెంజొహర్, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బర్‌గఢ్, నువాపడా, బొలంగీర్, సోన్‌పూర్, బౌధ్, దేవ్‌గఢ్, అంగుల్, సంబల్‌పూర్, ఢెంకనాల్, కంధమల్ తదితర 14 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఐదు క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి ఖిలిగూడ గ్రామ అటవీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు గుట్టురట్టు చేశారు. పక్కా సమాచారం మేరకు చిత్రకొండ ఐఐసీ ముకుందో మెల్క సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఖిలిగూడ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటం చూసి ప్రశ్నించారు. వెంటనే పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఆంధ్రాకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 20 బస్తాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్రకొండకు చెందిన నారాయణ్ నాయిక్, ఖిలిగూడకు చెందిన సోనియా గోలారీగా గుర్తించారు. శనివారం వీరిని కోర్టులో హాజరుపరిచారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కారుడ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో కారు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పాండ్రీపణి గ్రామం వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కారు డ్రైవర్ మృతి చెందాడు. జైపూర్ నుంచి మల్కన్‌గిరి మీదుగా హైదరాబాద్ వెళ్తున్న కారు పాండ్రీపణి వద్దకు వచ్చేసరికి మొరాయించడంతో ఆగిపోయింది. రాత్రి కావడంతో డ్రైవర్ బయటకు దిగి రోడ్డు వైపుగా పడుకున్నాడు. ఈ సమయంలో అటుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి 11గంటల సమయంలో మల్కన్‌గిరికి వస్తున్న ఓ వాహనచోదకుడు పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే మల్కన్‌గిరి ఐఐసి రీగాన్‌కీండో సిబ్బందితో వెళ్లి మృతదేహన్ని పరిశీలించాడు. మృతుడి జేబులో ఉన్న కార్డు ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అనంతరం మల్కన్‌గిరి మార్చురీకి తరలించారు.

వ్యాపారిపై దాడి.. రూ.లక్ష దోపిడీ



బాధితుడు గుప్త

జయపురం: మల్కనగిరి నుంచి జయపురం వస్తున్న వస్త్రవ్యాపారిపై దోపిడీ దొంగలు దాడికి పాల్పడ్డారు. అతని వద్ద నుంచి లక్ష రూపాయలు లాక్కొని పరారయ్యారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై బాధితుడు బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జయపురంలో వస్త్ర వ్యాపారం చేస్తున్న సత్యనారాయణ గుప్త వ్యాపారం నిమిత్తం మల్కనగిరి వెళ్లారు. తిరిగి పికప్ వ్యాన్‌లో జయపురం వస్తుండగా మహుళి గ్రామ శివలింగం ప్రాంతంలో రెండు బైకులపై ఐదుగురు దుండగులు వచ్చి వ్యాన్ అడ్డుకున్నారు. గుప్తపై దాడి చేసి రూ.లక్ష దోచుకుపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీఎస్‌ఈ ఫలితాల్లో అదరగొట్టారు



నిఖిలేష్



తేజశ్విని

జయపురం: జయపురం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఐసీఎస్‌ఈ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారు. నూరు శాతం ఫలితాలు సాధించి అదరగొట్టారు. కామర్స్, సైన్స్ సబ్జెక్టుల పరీక్షలు రాసిన 38 మంది విద్యార్థులూ ఉత్తీర్ణులయ్యారు. సైన్స్ విభాగంలో పి.నిఖిలేష్ 96.8 శాతం మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఎస్.తేజశ్విని 94.6 శాతం మార్కులతో రెండో స్థానం, లక్ష్మీనృసింహ పండా 94.4 శాతం మార్కులతో తృతీయ స్థానం సాధించారు. కామర్స్‌లో పి.హుండవి 94.8 శాతం మార్కులతో ప్రథమ, నిత్య ముంద్ర 92.6 శాతం మార్కులతో ద్వితీయ, పి.సమీక్ష 87.2 శాతం మార్కులతో తృతీయ స్థానం సాధించారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ధాన్యం మండీలు ప్రారంభం



మండీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు

రాయగడ: రబీ ధాన్యం మండీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక తుంబిగుడలోని బజారు నియంత్రణ కమిటీ (ఆర్‌ఎంసీ) ప్రాంగణంలో తొలి రోజు 130 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లర్లు రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో 211 మంది రైతుల నుంచి సుమారు 11,477.77 క్వింటాళ్ల ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్‌ఎంసీ కార్యదర్శి బిపిన్ బిహారి బిసోయి తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు నిబంధనలు పాటించాలని, రైతులను మోసగించే ప్రయత్నం చేయకూడదని స్పష్టం చేశారు. ఎఫ్‌ఏక్యూ రకం ధాన్యం సేకరించాలని సూచించారు. కొంతమంది దళారులు రైతులను మోసగించి అధిక ధరలు ఇస్తామని నమ్మిస్తున్నారని, వారికి దూరంగా ఉండాలని హితవుపలికారు. కొలనార సమితి పరిధిలోని రైతులు కొలనార ఆర్‌ఎంసీ వార్డులో ప్రతి సోమవారం ధాన్యం క్రయవిక్రయాలు కొనసాగించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ (డీఆర్‌సీఎస్) మన్మధ కుమార్ దాస్, సీఎస్‌ఓ దాశరథి సొరేన్, ఎర్‌సీఎస్ జన్మాజయ్ మహంతి, మిల్లర్లు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి తెర

భువనేశ్వర్: రాష్ట్రంలో లోక్‌సభ, శాసన సభ ఎన్నికల రెండో దశ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడింది. ఐదు లోక్‌సభ స్థానాలు, 35 శాసన సభ స్థానాల్లో రెండో విడత పోలింగ్ ఈ నెల 20న జరగనుంది. ఐదు లోక్ సభ స్థానాల్లో 40 మంది అభ్యర్థులు, 35 శాసన సభ స్థానాలకు 265 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 79,62,148 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రచారం ముగిసే ఆఖరి క్షణం వరకు బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ అగ్రనేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చివరి ప్రయత్నాలు చేశారు. బొలంగీర్, బర్‌గఢ్, సుందర్‌గఢ్, కంధమల్, అసికా లోక్‌సభ నియోజకవర్గాలతో అనుబంధ శాసనసభ నియోజక వర్గాల్లో ఓటింగ్ జరగనుంది.

బరిలో మహామహులు..

రెండో దశ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రముఖ నాయకులు ప్రత్యక్షంగా తలపడుతున్నారు. వీరిలో బీజేడీ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మాజీ మంత్రి జుయల్ ఓరం, సంగీతా కుమారి సింగ్ దేవ్, భారత హాకీ మాజీ కెప్టెన్ దిలీప్ టిర్కీ, కేంద్ర మాజీ మంత్రి, హోటళ్ల వ్యాపారి దిలీప్‌రాయ్, డాక్టర్ అచ్యుత సామంత, నిరంజన్ పూజారి, ప్రదీప్ కుమార్ ఆమత్ వంటి ప్రముఖులు ఉన్నారు. వీరి గెలుపు కోసం ఆయా పార్టీల అగ్ర శ్రేణి నాయకులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి హోరాహోరీగా ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థుల కోసం హోంమంత్రి అమిత్ షా, బీజేడీ అభ్యర్థుల తరపున ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కాంగ్రెస్ టికెటుతో పోటీ చేస్తున్న వారి కోసం రాహుల్ గాంధీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రచారం చివరి రోజున కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సుందర్‌గఢ్, రాజ్‌గంగ్‌పూర్, బొణాయ్ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్ ఎంపీ హేమామాలిని అంగుల్, పల్లాలాహడా, దేవగఢ్ ప్రాంతాల్లో బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించి భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించమని అభ్యర్థించారు.



బీజేపీ ఎన్నికల ప్రచార సభలో హేమామాలిని

సంబల్‌పూర్‌లో నెక్కంటి ప్రచారం

రాయగడ: బీజేడీ అధినేత, సీఎం నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు సంబల్‌పూర్ శాసనసభ నియోజకవర్గంలో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇక్కడ అధిక సంఖ్యలో తెలుగు ప్రజలు ఉండటంతో వారిని ఆకర్షించేందుకు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సంబల్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డు, సింధూర్‌పంక్, 38 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి బీజేడీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. తెలుగు సామాజికవర్గ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. అత్తాబిర ప్రాంతంలో అధిక శాతం తెలుగు ప్రజలు, రైతులు ఉండటంతో ముమ్మర ప్రచారం చేపట్టారు. నెక్కంటితో పాటు పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొరాపుట్ జిల్లాకు చెందిన రబినారాయణ నొందొ కూడా ఉన్నారు.



సంబల్‌పూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నెక్కంటి భాస్కరరావు, నొందొ

కరుణించమ్మా.. కన్యకా పరమేశ్వరీ!



జయపురం: ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి దేవి



జయపురం: రథంపై అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



జయపురం: పవిత్ర జలాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



జయపురం: కలశలతో పవిత్ర జలాలను తీసుకువెళ్తున్న బాలికలు



పర్లాకిమిడి: అమ్మవారిని దర్శించుకుంటున్న కళింగ వైశ్యసంఘం అధ్యక్షుడు బాలాజీరాజు, పొట్నూరు రామకృష్ణ

జయపురం: స్థానిక మహారాణిపేటలో వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 6.30 గంటలకే నీలకంఠేశ్వర ఆలయం నుంచి వందలాది మంది మహిళలు, బాలలు కలశాలతో పవిత్ర జలాలు తీసుకొచ్చేందుకు ఎన్.కె.టి.రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీప కెనాల్‌కు తరలివెళ్లారు. అక్కడి నుంచి 108 కలశాలతో దేవీ ఆలయానికి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రాల రథంపై వాసవీ కన్యకాపరమేశ్వరి నిలువెత్తు చిత్రపటాన్ని అధిష్టించి తోడ్కొనివచ్చారు. పవిత్ర జలాలతో అమ్మవారికి కుంభాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని బంగారు కిరీటంతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

- పర్లాకిమిడి: స్థానిక కొత్తబస్టాండ్ రోడ్డులో వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అర్చకులు వనమాళి మాణిక్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళింగ వైశ్య సంఘం, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షులు వైశ్యరాజు బాలాజీరాజు ఆధ్వర్యంలో 150 మంది ముత్తయిదువులతో నీరాజన మంత్రపుష్పం, లలితాస్తోత్ర పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో కళింగ మహిళా వైశ్య సంఘం అధ్యక్షురాలు కోట్ని శోభారాణి, పొట్నూరు రామకృష్ణ, చంద్రశేఖర్, వడ్డి శ్రీనివాసరావు, పి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: సామూహిక లలితా స్తోత్ర పారాయణం

క్లుప్తంగా

అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉమ్మడి జిల్లాలో అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ పూర్తిచేశారు. దుప్పలవలస, కొల్లివలస, కంచిలి, ఉంగరాడమెట్ట బాలుర జూనియర్ కళాశాలల్లో 320 సీట్లకు 65 ఖాళీలు మిగిలాయి. బాలికల గురుకుల కళాశాలలు ఎచ్చెర్ల, పెద్దపాడు, తామరాపల్లి, నందిగాం, మందస, పాతపట్నం, వంగర, భామినిల్లో 720 కి 156 ఖాళీలు ఉన్నాయి. ఆ వివరాలను కోఆర్డినేటర్ బాలాజీకి అందజేశారు. ప్రవేశాల మార్గదర్శకాలు వచ్చిన తర్వాత ప్రవేశాలు చేపట్టనున్నారు. ప్రవేశ పరీక్ష ర్యాంకుతో సంబంధం లేకుండా పదో తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశించే అంశం పరిశీలిస్తున్నారు.

'అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలి'

హిరమండలం: వన్‌ధన్ వికాస కేంద్రాలకు అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌ను కల్పించాలని సీతంపేట వైకేపీ ఏపీడీ సన్యాసిరావు అన్నారు. ఆయన శనివారం స్థానిక వెలుగు (వైకెపి)కార్యాలయలంలో ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు వన్‌ధన్ వికాస్ కేంద్రాలు ఉన్నాయని, వాటికి అటవీ ఉత్పత్తులైన జీడి, చీపురు, రాగులుకు తగు మార్కెటింగ్ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంను ఆదేశించారు. అలాగే డ్వాక్రా స్వయంశక్తి సంఘాలకు సంబంధించిన సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే సంఘాల అప్పులు వంద శాతం వసూలు చేయాలని సూచించారు. సంఘాలు గ్రేడింగ్‌ను పెంచి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శ్రీదేవి, అప్పన్న, జయంతి, అసిరయ్య, సుజాత వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్త క్రిమినల్ చట్టాలకు సిద్ధం కావాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: దేశంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్రిమినల్ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమలు కానున్నాయని, అందుకు న్యాయవాదులు సిద్ధం కావాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ పీపీ మెట్ట మల్లేశ్వరరావు తెలిపారు. జిల్లా కోర్టుల సముదాయంలోని ప్రాసిక్యూషన్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రిమినల్ చట్టాలపై ఇటీవల హైదరాబాద్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేశారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వాన కృష్ణచంద్, టి.శివప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది భాగ్యలక్ష్మి, పోలీస్ లైజన్ ఆఫీసర్స్ ఆనందరావు, హరికృష్ణ, సురేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

164 ఏళ్ల కట్టడం నేలమట్టం


పర్లాకిమిడిలో రైల్వేస్టేషన్ ఆధునికీరణ పనులు


కూల్చివేతకు ముందు పాత రైల్వేష్టేషన్ గొడౌన్


కూల్చివేసిన తర్వాత ఇలా..

- పర్లాకిమిడి రైల్వేష్టేషన్‌లో పాత పార్శిల్ గోడౌన్ కూల్చివేత
- కార్యరూపం దాల్చని మ్యూజియం ఏర్పాటు

పర్లాకిమిడి: అతిపురాతనమైన పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో 1860లో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన పాత పార్శిల్ గొడౌన్‌ను శనివారం నేలమట్టం చేశారు. వాల్తేరు రైల్వే డివిజన్ ఆదేశాల మేరకు ఈ పురాతన భవనాన్ని కూల్చివేశారు. జర్మన్స్ కామన్‌వెల్త్ ట్రస్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో బేసెల్ మిషన్ టైల్స్‌ను ఇక్కడ తయారుచేసి నౌపడా స్టేషన్‌కు తరలించేవారు. ప్రస్తుతం ఈ రైల్వే నిర్మాణాలకు వాడే టైల్స్‌ను నౌపడా రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్నారు. అప్పట్లో ఈ గోదాములో మహేంద్రగిరి అడవుల నుంచి తెచ్చిన కలప, ఖుర్దా నుంచి తెచ్చిన రాళ్లు, పశ్చిమబెంగాల్ నుంచి టైల్స్‌తో రూఫ్‌లు తయారయ్యేవి. అయితే పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆధునికీకరిస్తుండటంతో పాత స్టేషన్ మాస్టర్ భవనం, పాత పార్శిల్ గోడౌన్‌ను కూల్చివేశారు. 180 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ హెరిటేజ్ గోడౌన్‌లో పర్లాఖెముండి మహారాజావారు అప్పట్లో ఏర్పాటుచేసిన రైల్వే స్టీమ్ ఇంజన్ తదితర పురాతన వస్తువులతో సంగ్రహాలయం ఏర్పాటుచేస్తే బాగుంటుందని అనేకమంది పర్లాకిమిడి వాసులు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతులు పంపించారు. అయినా కార్యరూపం దాల్చలేదు. కాగా, కూల్చిన ఈ పాత గోదాముల స్థానంలో కొత్తవి నిర్మించడంతో పాటు నిర్మాణంలో వున్న ప్లాట్‌ఫారం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి భరత్ భూషణ్ మహంతి కోరారు.


పర్లాకిమిడిలో నూతనంగా నిర్మించిన ప్లాట్‌ఫారం

రైల్వే పురస్కారాలు ప్రదానం


డీఆర్‌ఎం చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకున్న భువనేశ్వర్ సీటీఐ స్క్వాడ్ ఇన్‌చార్జి సతీష్ చంద్రదాస్


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం 68వ రైలు సేవా పురస్కార ఉత్సవం – 2023 స్థానిక రెటాంగ్ కాలనీ రైల్వే కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్.బజ్వా మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో సిబ్బంది విశేష కృషి చేశారని అభినందించారు. జోనల్ స్థాయిలో రైలు సేవా పురస్కార ఉత్సవంలో ఖుర్దా రోడ్ మండలం విశిష్ట రైల్వే సేవా పురస్కార్ – 23 సాధించడం దీనికి తార్కాణంగా పేర్కొన్నారు. సమగ్ర సామర్థ్య షీల్డుతో 8 ఇతర సమర్థతా షీల్డ్‌లను ఖుర్దారోడ్ మండలం సాధించిందని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన విజయాలను వివరిస్తూ టెర్మినల్స్‌లో సరుకు ఎగుమతి, దిగుమతి సమగ్ర రవాణా నిర్వహణలో ఈ డివిజన్ అగ్ర స్థానంలో నిలిచిందన్నారు. సరుకు ఎగుమతి రంగంలో జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఖుర్దా రోడ్ డివిజన్‌ను భారతీయ రైల్వేలో అత్యుత్తమ డివిజన్‌గా మార్చేందుకు సిబ్బంది అంకితభావం మరువలేనిదన్నారు. అనంతరం 65 మంది రైల్వే ఉద్యోగులకు డీఆర్‌ఎం రైల్ సేవా పురస్కార్–2023లతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు మండల రైల్వే మేనేజర్ (ఆపరేషన్) కళ్యాణ్ పట్నాయక్, అదనపు మండల రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రా) శుభ్రజ్యోతి మండల్, సీనియర్ మండల కార్మిక అధికారి ఆర్.ఎన్.ఏ. పరిడా తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడింగ్‌తో ప్రమాదాలు


సరుగుడు కర్రల లోడింగ్‌తో వెళ్తున్న లారీ

రాయగడ: లారీలు, వ్యాన్‌లు పరిమితికి మించి లోడ్లు తీసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రం నుంచి పేపర్ తయారీకి వినియోగించే వెదురు, సరుగుడు వంటి కర్రలతో ఓవర్ లోడ్‌తో లారీలు వస్తున్నాయి. కర్రలకు కట్టిన తాడు ఏమాత్రం తెగిపడిన పెను ప్రమాదం తప్పదని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కొరుతున్నారు.

కల్వర్టు మరమ్మతు పనులు ప్రారంభం


శంకర్‌బాస్ చెరువు వద్ద డైవర్షన్


కల్వర్టు పనులు చేపడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండ్ రోడ్డులో శ్రీక్రిష్టా సినిమా థియేటర్ జంక్షన్ ఒడియా డెప్పవీధిలో ఎట్టకేలకు కల్వర్టు పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడి కల్వర్టు దెబ్బతినడంతో కాలువ నీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల స్థానికులు ఆందోళన సైతం చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారులు పనులు చేయలేకపోయారు. ఇటీవలే ఎన్నికలు ముగిసినందున పనులు ప్రారంభించారు.



• మడుగులో మీనాల వేట

మడుగు అడుగంటినా తమ కడుపు నింపుతుందని కొంగలు ఆశ్రయించాయి. ఎండ ధాటికి నీరింకిపోతున్న కొలనులో చేపల కోసం ఇలా వెతికాయి. టెక్కలి సమీపంలో ఈ దృశ్యం కనిపించింది. - టెక్కలి

ఓట్ల లెక్కింపుపై శిక్షణ


హాజరైన అధికారులు

జయపురం : ఈ నెల 13న అవిభక్త కొరాపుట్ కలహండి జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరిగిన నేపథ్యంలో కొరాపుట్, మల్కనగిరి, నవరంగపూర్, రాయగడ, కలహండి, నువాపడ జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులకు శుక్రవారం ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు.

కొరాపుట్‌లోని సద్భావన గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు జిల్లాల కలెక్టర్లు, జిల్లా ప్రధాన ఎన్నికల అధికారులు, 21 మంది రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

రాయగడ: జిల్లాలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులతో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాశీపూర్ సమితి టికిరి ప్రభుత్వ మాధ్యమిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సుమన్‌నాయక్ ఏప్రిల్ 19న మృతి చెందాడు. విద్యార్థి మృతికి ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలో కలెక్టర్ మహాజన్ దర్యాప్తునకు ఆదేశించారు. ఏప్రిల్ 20న జిల్లా విద్యాశాఖాధికారి బసంతకుమార్ నాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భరత్ భూషణ్ బిశ్వాల్‌లు టికిరి పాఠశాలకు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు లొచన్ ఖొర, ఉపాధ్యాయుడు టొంకొధొరా నాయక్‌లను సస్పెండ్ చేశారు. అదేవిధంగా గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని టొలొన పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటనకు సంబంధించి కూడా హెచ్‌ఎం సంగీతకుమారి ఓంకార్, ఉపాధ్యాయుడు ధుర్యోధన్ సాబొరొలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

పశుపక్ష్యాదుల దాహం తీరుస్తూ..


ఉమ్మరకోట్‌లో ఏర్పాటు చేసిన నీటి టబ్‌లు

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఎండలు మండుతుండటంతో ప్రజల దాహం తీర్చేందుకు పురపాలక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. అయితే పట్టణాల్లో ఉన్న పశుపక్ష్యాదులు దాహార్తితో విలవిల్లాడుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొందరు పక్షుల కోసం నీటికుండీలు ఏర్పాటు చేస్తున్నారు. సునాబెడలో ఓ వ్యక్తి పక్షుల దాహార్తి తీర్చేందుకు చెట్ల వద్ద నీటి కుండీలు ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్‌లో ఉత్కళ గోశాల సమితి వారు పలు ప్రాంతాల్లో కుండీలు ఏర్పాటు చేసారు. ఇటీవల జయపురం అటవీ విభాగం ఆధ్వర్యంలో అడవులలో చెట్లపై పక్షుల కోసం ప్లాస్టిక్ టబ్‌లు ఏర్పాటు చేశారు.


సునాబెడలో పక్షుల కోసం నీటి తొట్టె



• గీత కళతో సెలవులకు సారం

కళా సేవలో అవిశ్రాంత యోధులు

బదులకు సెలవులు ఇచ్చేశారు. స్నేహితులతో కాలక్షేపం చేద్దామంటే బంధువుల ఊళ్లకు, విహార యాత్రలకు చెక్కేశారు. పోనీ ఇరుగు పొరుగు పిల్లలతో ఆరు బయట ఆడుకుందామంటే ఎండలు మాడు పగులగొడుతున్నాయి. దాంతో ఏమీ తోచక సెలవు రోజులను నిస్సారంగా గడిపేస్తున్న పిల్లలకు ఆ దిగులు లేకుండా చేస్తున్నారు ఇద్దరు గురువులు. తమకు కరతలామలకం అయిన గీత (డ్రాయింగ్) కళతో ఔత్సాహిక విద్యార్థుల సెలవులను సారవంతం చేస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసినా కళా బోధనకు, కళా సేవకు విశ్రాంతి లేదని చాటి చెబుతున్నారు ఈ ఇద్దరు డ్రాయింగ్ టీచర్లు. గత రెండు దశాబ్దాలుగా తమ 'గీత'సారాన్ని పిల్లలకు ఆరారా నూరిపోస్తున్నారు. చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ పేరుతో జిల్లా కేంద్రంలో పిల్లలకు కళలు బోధిస్తున్నారు.



- రిటైరయ్యాక కూడా బోధిస్తున్న టీచర్లు
- చిన్నారులను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న వైనం
- శ్రీకాకుళంలో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ నిర్వహణ
- ప్రతి వేసవిలో 200మందికి విద్యార్థులకు శిక్షణ



శ్రీకాకుళం కల్చరల్:

పిల్లలు హాయిగా నవ్వాలి. నవ్వుతూ ఆడుకోవాలి. ఆడుతూ నేర్చుకోవాలి. నేర్చుకుంటూ పైకి ఎదగాలి.. చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ ఉద్దేశమిదే. ఇక్కడ డ్రాయింగ్ నేర్చుకున్నా, సంగీత సాధన చేసినా, నృత్యం చేసినా.. దాని ఉద్దేశం సెలవులను సరైన రీతిలో ఉపయోగించుకోవడమే. ఇప్పటికే రెండు వందల మందికిపైగా పిల్లలు ఈ క్లబ్‌లో చేరి తమకు ఇష్టమైన అంశాలను నేర్చుకుంటున్నారు. ఈ క్లబ్ నిర్వహణ వెనుక ముఖ్యంగా ఇద్దరి కృషి ఉంది. డబ్బై ఏళ్ల వయసు దాటినా ఇంకా చురుగ్గా పనిచేస్తున్న ఇద్దరు మాస్టార్ల జీవితముంది.

వీరిద్దరిలో ఒకరు మిమిక్రీ కళలో జాతీయ స్థాయి కళాకారుడిగా పేరు తెచ్చుకుంటే మరొకరు సాంఘిక నాటికలకు ఉత్తమ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్లు లోకనాథం నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్ (బెహరా మధుసూదన పట్నాయిక్)లు కలసి గత 20 ఏళ్లుగా చిన్నారుల్లో ఉన్న సృజనను వెలికి తీసేందుకు విశేష కృషి చేస్తున్నారు. వీరికి వచ్చిన చిరు ఆలోచనతో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్‌ను తమ మిత్రులు మిమిక్రీ శ్రీనివాస్, నటుకుల మోహన్‌ల సహకారంతో ఏర్పాటు చేశారు. చిన్నారులను ఒక చోటకు చేర్చి వారికి ఆటలు, పాటలు, జీకే, వ్యాసరచనలు ఇలా వారి భవిష్యత్‌కు ఉపయోగ పడే ఎన్నో విషయాలపై తర్ఫీదు ఇస్తున్నారు.

ఎప్పుడో రిటైరైనా..

పాతశ్రీకాకుళానికి చెందిన లోకనాథం నందికేశ్వరరావు 1979 నుంచి డ్రాయింగ్ టీచరుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. చిన్నతనం మిమిక్రీలో నైపుణ్యం చూపేవారు. 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా సత్కారం పొంది, గుర్తింపు పొందారు. 2010లో ఉద్యోగ విరమణ చేశారు. కళింగపట్నానికి చెందిన బీఎంఎస్ పట్నాయిక్‌గా గుర్తింపు పొందిన బెహరా మధుసూదన పట్నాయిక్ అక్కడ నాటకాల సేవలో నిరంతరం ఉండేవారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఖమ్మం జిల్లా ములుగులో డ్రాయింగ్ టీచరుగా 1966లో పనిచేశారు. తెలంగాణ గొడవల్లో తిరిగి ఆంధ్రాకు వచ్చి 1970 నుంచి ఉద్యోగం చేసి 2001లో పదవీ విరమణ చేశారు. 2011లో బాలలతో రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవ పోటీల్లో 'దాడి' నాటికకు దర్శకత్వం వహించి బంగారు నంది సాధించారు. ఇప్పటికీ బొరివంక శార్వాణీ ద్వారా నంది నాటకాలకు దర్శకత్వం వహిస్తున్నారు.

20 ఏళ్లుగా లాఫింగ్ క్లబ్ సేవలు

చిన్నారుల కోసం 2003లో ఒక లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ప్రస్తుత రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ ఎల్.నందికేశ్వరరావు తాను ఉద్యోగంలో ఉన్నప్పటి నుంచే దీనికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి కొందరు మిత్రులతో కలసి పట్టణంలోని రివర్ వ్యూ పార్కులో ప్రతి మొదటి, మూడు ఆదివారాల్లోని సాయంత్రం వేళల్లో చుట్టు పక్కల ఉండే చిన్నారులను ఒక చోట చేర్చి వారికి ఆటలు, పాటలు, వ్యాసరచనలు, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేసి దాతల సహకారంతో వారికి బహుమతులు ఇస్తూ క్లబ్ నిర్వహిస్తున్నారు.

ఏడాదికి 200 మంది చిన్నారులు...

వేసవి సెలవులు వచ్చాయంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడకు పంపడం మొదలు పెట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలనుంచి చిన్నారులు వచ్చి చేరుతున్నారు. ప్రతి ఏడాది అన్ని విభాగాలలో కలిపి మొత్తంగా 200 మంది చిన్నారులు వారి అభిరుచి మేరకు నేర్చుకుంటున్నారు. నందికేశ్వరరావుతోపాటుగా రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ బీఎంఎస్ పట్నాయిక్, ప్రస్తుతం ఉద్యోగంచేస్తున్న దుర్గా ప్రసాద్, సాయి ప్రసాద్, దీప్తి కూడా తమ సేవలను అందిస్తున్నారు


చిన్నారులు గీసిన చిత్రాలు

2012లో మొదటి సారిగా వేసవి శిబిరాలు

ఈ ఇద్దరు డ్రాయింగ్ టీచర్లు రిటైరయ్యాక.. డ్రాయింగ్‌ను ఇతరులకు పంచాలనే మంచి ఆలోచనతో వేసవి శిక్షణ శిబిరాలను కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న తమ ఇంటి వద్ద ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులు పెరుగుతున్నందున అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఉచితంగా డ్రాయింగ్ బోధన చేస్తు వారిలో ఉన్న టాలెంట్‌ను పెంచుతున్నారు. 2011, 2012 నుంచి వేసవిలో డ్రాయింగ్ శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. కొందరు యువ డ్రాయింగ్ టీచర్ల సహాయం కూడా తీసుకున్నారు. అప్పటి కలెక్టర్ నరసింహం సలహా మేరకు ఒక్క డ్రాయింగ్‌లోనే కాకుండా ఇతర అంశాలైన పేపర్ క్విల్లింగ్, కూచిపూడి నృత్యం, సంగీతం, పెయింటింగ్‌పై శిక్షణలు ఇస్తున్నారు. వేసవి శిబిరంలో పాల్గొని నేర్చుకున్న డ్రాయింగ్ విద్య ద్వారా ఇప్పటికే ఐదుగురు ఉద్యోగాలను సాధించారు కూడా.

ఎంతో తృప్తిగా ఉంది



మాకు వచ్చిన విద్యను చిన్నారులకు నేర్పడం ఎంతో తృప్తిగా ఉంది. ఉద్యోగంలో ఉంటూ చేసిన నా ఆలోచనకు కొందరు మిత్రులు తోడై క్లబ్ ఏర్పాటు చేశాం. ముఖ్యంగా చిన్నారులకు వినోదం కలిగించడమే మా ధ్యేయం. విజ్ఞానం కూడా అందిస్తున్నాం.

– ఎల్.నందికేశ్వరరావు, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

ఆనందాన్ని ఇస్తోంది..



నా మిత్రుడు నందికేశ్వరరావు పిలుపు మేరకు నా టాలెంట్‌ను కూడా నలుగురికి పంచాలని అతనికి చేదోడుగా నిలిచాను. ఇది నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. రాబోయే తరానికి మంచి విషయాలు నేర్పడం వల్ల మంచి పౌరులుగా మారుతారు.

– బీఎంఎస్ పట్నాయిక్, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

చిన్నారులంటే నాకు ఇష్టం



చిన్నారులంటే నాకు చాలా ఇష్టం. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం మా ఉద్దేశం. లాఫింగ్ క్లబ్‌కు నా వంతు సహకారం అందిస్తున్నాను. చిన్నారుల బాల్యానికి మెరుగు దిద్దుతున్న ఇద్దరు స్నేహితులకు అండగా ఉంటున్నాను.

– నటుకుల మోహన్, క్లబ్ నిర్వాహకులు

క్లుప్తంగా

3,200 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో అధికారులు

బొబ్బిలి: పట్టణం నుంచి పిరిడి వెళ్లే రహదారి జంక్షన్ వద్ద 3,200 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ అల్లు స్వర్ణలత తెలిపారు. శనివారం సాయంత్రం తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా.. పిరిడి గ్రామానికి చెందిన రేపాక శ్రీనివాసరావుకు చెందిన బియ్యంగా గుర్తించినట్టు సీఎస్‌డీటీ చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై రామారావు, సిబ్బంది లక్ష్మీనారాయణ, ఈశ్వర్ పాల్గొన్నారు.

21న అండర్ -16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న అండర్ -16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఎల్ఎన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని విజ్జి స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2008 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అలాగే పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జన్మదిన ధ్రువపత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. ఎంపికలు నిర్వహించే రోజు ఉదయం 6.30 గంటలకు వైట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరు కావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన సత్యం

బొండపల్లి: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. డెంకాడకు చెందిన కనకల సత్యం (55) బొండపల్లి నుంచి విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో సత్యం తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. తస్యం ఆర్టీలో విధులు నిర్వహిస్తున్నాడని ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెత్తబుట్టలో పసికందు మృతదేహం



నెలలు నిండని పసికందు మృతదేహం

విజయనగరం క్రైమ్: నెలలు నిండని పసికందు మృతదేహం చెత్తబుట్టలో పడేసిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సుమారు ఐదారు నెలల వయసున్న ప్రీ మెచ్యూర్డ్ బేబీ మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బాక్సులో పెట్టి గంట స్తంభం సమీపంలో ఉన్న కార్పొరేషన్ చెత్తబుట్టలో శనివారం రాత్రి పడేశారు. చెత్త వేసేందుకు వెళ్లిన కొందరికి రక్తపు చారలు కనపడడంతో బాక్స్ ఓపెన్ చేసి చూడడంతో మృతదేహం బయటపడింది. దీంతో వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఎవరో తెచ్చి పడేసి ఉంటారని పోలీసులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, సీసీ పుటేజ్ పరిశీలించి బాధితులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కోరాడ రామారావు తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి

దత్తిరాజేరు: చెరువులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆర్. రామచంద్రాపురంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్. బూర్జవలస ఎస్సై లక్ష్మీ ప్రసన్న కుమార్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండాది గౌతం (10) తోటి స్నేహితులతో కలిసి మల విసర్జనకు పప్పల చెరువుకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి చెరువులో పడిపోవడంతో తోటి స్నేహితులు బయటకు తీసి విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. వెంటనే స్థానికులు చేరుకుని 108 సిబ్బందికి ఫోన్ చేయగా... వారు వచ్చి పరిశీలించారు. అయితే అప్పటికే చిన్నా రి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. తల్లి మృతి చెందడంతో గౌతం తాత ఇంటి వద్దనే ఉంటూ చదువుకుంటున్నాడు. మృతుడి తాత సాంబ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్షు పెరుగుతోంది..

- ఆస్పత్రుల్లో 'జగనన్న హృదయ స్పందన'
- గుండె నొప్పితో వచ్చే వారికి ప్రత్యేక చికిత్స
- గతేడాది సెప్టెంబర్ నెల నుంచి జిల్లాలో కార్యక్రమం అమలు
- సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో సేవలు..
- రూ. 25 వేల విలువ చేసే ఇంజిక్షన్ ఉచితం
- సకాలంలో చికిత్స అందడంతో నిలుస్తున్న ప్రాణాలు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో రోగికి ఈసీజీ తీస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవన శైలిలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ఒకేచోట కూర్చొని గంటల తరబడి పనిచేయడం.. వ్యాయామం చేయక పోవడం.. జంక్‌ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి ఎక్కువగా తినడం వల్ల గుండె జబ్బులకు గురవుతున్నారు. గతంలో 50, 60 ఏళ్ల పైబడిన వారు గుండె జబ్బుల బారిన పడేవారు. కాని ఇప్పుడు 25, 30 ఏళ్లకే గుండె జబ్బుల బారిన పడుతున్నారు. గుండె నొప్పి (హార్ట్ ఎటాక్) వచ్చే సమయంలో సకాలంలో (గోల్డెన్ అవర్) చికిత్స అందించగలిగితే ప్రాణాపాయం తప్పుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గుండెనొప్పి, గుండె జబ్బుల బారిన పడిన వారికి సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో జగనన్న హృదయ స్పందన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయి.

జగనన్న హృదయ స్పందన కార్యక్రమంలో అందించే సేవలు..

జగనన్న హృదయ స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీల్లో అమలు చేస్తున్నారు. ప్రతి ఆస్పత్రిలోనూ ప్రత్యేకమైన బెడ్ ఏర్పాటు చేశారు. ఛాతి నొప్పితో గాని అలసటతో గాని బాగా నీరసంతో గాని వచ్చే వారికి ఈసీజీ తీస్తారు. ఆ ఈసీజీ రిపోర్టును కార్డియాలజిస్ట్ ఉన్న ఆస్పత్రికి యాప్ ద్వారా పంపిస్తారు. వెంటనే ఆ రిపోర్టును కార్డియాలజిస్ట్ పరిశీలించి అవసరం ఉంటే రూ.25 వేల విలువ చేసే టీపీఏ ఇంజిక్షన్ ఇవ్వాలని సూచిస్తారు. వెంటనే సిబ్బంది ఇంజిక్షన్ ఇచ్చి, రోగి కోలుకున్న తర్వాత అవసరం అనుకుంటే కార్డియాలజిస్ట్ ఉన్న ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. అక్కడ స్టంట్ వేయలా.. సర్జరీ చేయాలా, లేదా అన్నది నిర్ణయిస్తారు.

వైద్యులు, సిబ్బందికి శిక్షణ..

గుండె సమస్య ఉన్న వారికి ఇచ్చే టీపీఏ ఇంజిక్షన్ ఏ విధంగా వేయాలన్న దానిపై వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వ వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. గతేడాది సెప్టెంబర్ నెలలో జగనన్న స్పందన హృదయ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు 65 మందికి టీపీఏ ఇంజిక్షన్ ఇచ్చారు. సకాలంలో చికిత్స అందడం వల్ల చాలా మంది ప్రాణాలు నిలబడ్డాయి.

అందుబాటులో ఇంజిక్షన్లు..

ప్రతి ఆస్పత్రిలోనూ టీపీఏ వైల్స్ రెండు, మూడింటిని అందుబాటులో ప్రభుత్వం ఉంచింది. ఒక్కో ఇంజిక్షన్ ఖరీదు రూ. 25 వేలు కావడంతో దుర్వినియోగం కాకుండా వైద్యాధికారులు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఆస్పత్రిలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయడంతో రోగులకు ఈసీజీ, టీపీఏ ఇంజిక్షన్లు ఇచ్చే విధానంపై ఉన్నతాధికారులు పరిశీలిస్తుంటారు.

24వ తేదీ నుంచిపదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

- డీఆర్‌ఓ కేశవనాయుడు

పార్వతీపురం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పార్వతీపురం డీవీఎంఎం ఉన్నత పాఠశాల, సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలకు 659 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని, తదనుగుణంగా బస్సులు నడపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరీక్ష పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పోస్టల్ సిబ్బందని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 384 మంది..

ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 384 మంది హాజరు కానున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు తెలిపారు. పార్వతీపురం కేవీఎం పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు పార్వతీపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతాయని.. ఈ పరీక్షలకు 288 మంది హాజరు కానున్నారని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ సుధాకర్, వైద్యారోగ్యశాఖ అధికారి ఎం. వినోద్, ఆర్టీసీ సహాయ మేనేజర్ బి. కృష్ణమూర్తి, సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కౌన్సెలింగ్

సీతానగరం: ఏపీ గిరిజన సంక్షేమ ప్రతిభా గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయం ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు జోగింపేటలో పాఠశాలలో కౌనెల్సింగ్ నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 7న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హులైన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు ఫోన్ ద్వారా, కాల్‌లెటర్ల ద్వారా సమాచారం అందించామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 8వ తరగతి, ఇంటర్మీడియట్‌లో.. మల్లి (పీజీటీ) కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ ఉమ్మడి జిల్లాలకు చెందిన గిరిజన బాలురు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 94909 57218, 94401 03332 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మృతదేహం గుర్తింపు

సీతంపేట: మండలంలోని పులిపుట్టి ఎర్రచెరువు వద్ద హత్యకు గురైన మహిళను ఒడిశా వాసిగా గుర్తించినట్లు పాలకొండ సీఐ ఎం. చంద్రమౌళి, ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ, డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారన్నారు. ఇందులో ఒక బృందం ఒడిశా వెళ్లి విచారణ చేయగా.. మృతురాలు గజపతినగరం జిల్లా గుమ్మ మండలం రుగడ గ్రామానికి చెందిన బుయస్ రుతగా గుర్తించారని చెప్పారు.

కళాశాలలకు.. సౌకర్యాల కళ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నాడు-నేడు పనులతో అందంగా ముస్తాబయ్యాయి. సకల సదుపాయాలతో విద్యార్థుల చదువుకు ఆలవాలంగా రూపుదిద్దుకున్నాయి. ప్రమాణాలతో కూడిన విద్యను భోదించే అధ్యాపకులు... కార్పొరేట్‌ను తలదన్నేలా ఫలితాల సాధనకు వీలుగా విద్యా ప్రణాళికలు అమలు చేసే ప్రిన్సిపాళ్లు కళాశాలల సొంతం. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. భవిష్యత్తును బంగారుమయం చేసుకునేందుకు రా రమ్మంటున్నాయి.

- కార్పొరేట్‌ను తలదన్నేలా ముస్తాబైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- 17 కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన
- నాడు-నేడు కింద రూ.11.81 కోట్ల కేటాయింపు
- 8 ప్రధాన అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం
- ప్రవేశాలకు ఆహ్వానం
- కార్పొరేట్‌కు మించి ఫలితాల సాధన





పరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు



విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖద్వారం

విజయనగరం అర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. గడిచిన ఐదేళ్లలో విప్లవాత్మక సంస్కరణలు అమలుచేసింది. పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను నాడు-నేడు నిధులతో ఆహ్లాదంగా తీర్చిదిద్దింది. ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించింది. కోట్లాది రూపాయల ఖర్చుతో కార్పొరేట్ కళాశాలను తలదన్నేలా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దింది.

రూ.18.11కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలల్లో 17 చోట్ల సొంత భవనాలున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం కళాశాలల్లో సదుపాయాల గురించి కనీసం పట్టించుకోలేదు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వీటి అభివృద్ధికి అవసరమైన సమగ్ర నివేదిక తీసుకున్నారు. జిల్లాలోని 17 కళాశాలల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను తీసుకొని రూ.11 కోట్ల 81 లక్షల 46 వేల నిధులను విడుదల చేశారు. గడిచిన రెండేళ్లలో వాటి పునఃనిర్మాణ పనులను చేపట్టారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి అన్ని కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తికానున్నాయి. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన సాగనుంది.

కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు

- సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి



సమస్యలపై చర్చిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి

విజయనగరం క్రైమ్: లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీసులు చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక న్యాయ సేవాసదన్‌లో ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, నాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థులు



బి.హరివిష్ణు



డి.చైతన్యకుమార్

రాజాం సిటీ: ఈ నెల 20 నుంచి 25 వరకు తమిళనాడులోని ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు జేఎన్‌టీయూ జీవీ విజయనగరం తరఫున ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జీఎంఆర్ ఐటీలో జరిగిన ఎంపికల్లో కళాశాలకు చెందిన బి.హరివిష్ణు 75 కిలోల విభాగంలోను.. డి.చైతన్యకుమార్ 150 కిలోల విభాగంలో ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, విద్యార్థులు అభినందించారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శనివారం వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారు బంగారు చీర, వజ్ర కిరీటంతో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, గణపతి హోమం, పుణ్యాహవచనం, సూర్య నమస్కారాలు, వాసవీ మూల మంత్ర జప సహిత హోమం, ఆయుష్య హోమం, పునర్వసు నక్షత్ర జపం, మహాన్యాసపూర్వక మహాలింగార్చన, సుందరకాండ పారాయణ, చండీహోమం, శ్రీదేవీ సప్తసతి పారాయణం, 108 కలశాలతో వాసవీమాతకు అభిషేకం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతుల సౌజన్యంతో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కోలగట్ల వీరభద్రస్వామి ఉత్సవంలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గజవాహనంపై అమ్మవారి తిరువీధి ఉత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం ..

విజయనగరం టౌన్: కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన అమ్మవారిని దర్శించుకుని, శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు కిలో బంగారంతో తయారు చేయించిన చీరను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఆయన సతీమణి రమణి చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఆయన వెంట దేవస్థానం కమిటీ చైర్మన్ నారాయణం శ్రీనివాసరావు, ప్రతినిధులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ ఈఏపీసెట్‌లో.. ర్యాంకుల పంట

ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థులు టీఎస్ ఈఏపీ సెట్‌లో ప్రతిభ చూపారు. ర్యాంకుల పంట పండించారు. ఇంజినీరింగ్ విభాగంలో పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన సతివాడ జ్యోతిర్ ఆదిత్య ప్రథమ ర్యాంకు, కొమరాడ మండలం దళాయిపేట గ్రామానికి చెందిన ధనుకొండ శ్రీనిధి పదో ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన నగుదాసరి రాధాకృష్ణ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకును సొంతం చేసుకున్నాడు.

– విజయనగరం అర్బన్/కొమరాడ/పాలకొండ/బలిజిపేట

- ఇంజినీరింగ్ విభాగంలో 1, 10 ర్యాంకులు
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో రెండో ర్యాంకు సాధన
- విద్యార్థులపై అభినందనల జల్లు

పాలకొండ విద్యా'జ్యోతి'



అభినందనలు తెలుపుతున్న తల్లి హైమావతి

విద్యల కొండ.. పాలకొండ అనే నానుడి మరో మారు రుజువయింది. పరీక్ష ఏదైనా ఈ ప్రాంత విద్యార్థులు ప్రతిభ చూపడం సాధారణం. శనివారం విడుదలైన తెలంగాణా ఈఏపీ సెట్‌లో పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన సతివాడ జ్యోతిర్ అదిత్య స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి అబ్బుర పరిచాడు. విద్యార్థి తండ్రి సతివాడ మోహనరావు సాంఘిక సంక్షేమశాఖలో సీనియర్ అసిస్టెంట్ (ఎచ్చెర్ల)గా పనిచేస్తుండగా, తల్లి హైమావతి ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువుల కోసం వీరు శ్రీకాకుళంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరి కుమార్తె ఉషశ్రీ ఇప్పటికే ఎంబీబీఎస్ చదువుతుండగా, కుమారుడు ఆదిత్య విజయవాడలో ఇంటర్మీడియట్ చదివి 954 మార్కులు సాధించాడు. తెలంగాణా రాష్ట్రం నిర్వహించిన ఈఏపీ సెట్‌లో ఫస్ట్‌ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం వల్లే మంచి ర్యాంకు వచ్చినట్టు జ్యోతిర్ ఆదిత్య తెలిపాడు. విద్యార్థికి యరకరాయపురం వాసులు అభినందనలు తెలిపారు.

చదువుల శ్రీనిధి



శ్రీనిధిని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

తెలంగాణ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించిన శ్రీనిధి స్వగ్రామం కొమరాడ మండలం దళాయిపేట. ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, గేదెల సుశీల ఇద్దరూ ఉపాధ్యాయులే. ఉద్యోగ రీత్యా విజయనగరం పట్టణంలో నివసిస్తున్నారు. శ్రీనిధి సీబీఎస్ఈలో 490/500మార్కులు సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో ఆల్‌ఇండియా ఓపెన్ కేటగిరీలో 261, ఓబీసీలో 35వ ర్యాంకు సాధించింది. జేఈఈ మెయిన్‌లో బీఆర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్‌ర్యాంకు సొంతం చేసుకుంది. పెద్ద కుమార్తె ధనుకొండ సాయి సుదీప్తి కూడా ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదవుతోంది. కుమార్తెలిద్దరూ చదువులో రాణిస్తుండడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. శ్రీనిధిపై గ్రామస్తులు అభినందనల జల్లు కురిపించారు.

చిలకలపల్లి కుర్రాడు సత్తా చూపాడు



రాధాకృష్ణకు స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

తెలంగాణా ఈఏపీ సెట్‌లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి చెందిన నగుదాసరి రాధాకృష్ణ సత్తా చూపాడు. రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. విద్యార్థి 9, 10 తరగతులు విశాఖలోని ఓ ప్రైవేటు పాఠశాలలో, ఇంటర్మీడియట్ రాజమండ్రిలోని ప్రైవేటు కళాశాలలో చదివాడు. తెలంగాణా ఈఏపీ సెట్‌లో ప్రతిభ చూపి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అభినందనలు అందుకున్నాడు. తల్లిదండ్రులు కృష్ణవేణి, నారాయణరావులది వ్యవసాయ కుటుంబం. ముగ్గురు పిల్లల్లో చిన్నవాడైన రాధాకృష్ణ చదువులో ప్రతిభ చూపడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. తాత, విశ్రాంత హెచ్ఎం ఎన్.వి.జగన్నాథం, అన్నదమ్ములు, మేనమామ ప్రోత్సాహం వల్లే ర్యాంకు సాధించగలిగినట్టు రాధాకృష్ణ తెలిపాడు.